క్లుప్తంగా

క్రీడా సామగ్రి వితరణ


టేబుల్ టెన్నిస్ ఆడుతున్న వీసీ, కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్

తిరుపతి సిటీ : తిరుపతి కెనరా బ్యాంక్ వారు సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఎస్వీ పశు వైద్య కళాశాల బాలికల వసతి గృహాలకు రూ.50వేల విలువైన క్రీడా సామాగ్రిని వితరణగా అందించారు. శుక్రవారం కళాశాల హాస్టల్‌లో ఈ మేరకు ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణకు కెనరాబ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.రామ మోహన్ చేతులమీదుగా టేబుల్ టెన్నిస్ బోర్డు, షెటిల్ బ్యాట్స్, క్యారం బోర్డులు అందజేశారు. వీసీ మాట్లాడుతూ కెనరా బ్యాంక్ అందజేసిన క్రీడా సామాగ్రిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, వార్డెన్లు కె.లక్ష్మీకవిత, శాంతిలక్ష్మి, కెనరా బ్యాంక్ అధికారులు సువర్ణారావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు

ముమ్మరంగా 'గీత' ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

పాకాల : మండలంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత విశిష్టతపై ప్రచారం చేపట్టారు. శుక్రవారం ఈ మేరకు పాకాల టౌన్‌తో పాటు పలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గీతా వైభవం వివరించారు. అలాగే ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాల సారాన్ని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కె.అశోక్‌బాబు, బాలాజీ, ధనుంజయ, వెంకటరత్నం, రవి, పద్మావతి, ఆషా, సంతోష్, చరణ్, వాణిశ్రీ, ఝాన్సీ, విజయ్, హరి, హేమతేజస్వి, గౌతమ్, ఉదయ్, సుస్మిత, ఆర్.సరళాదేవి పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై వేసవి శిక్షణ


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

పాకాల : మండలంలోని మొగరాల పంచాయతీ తలారివాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో బాల్య వివాహాల కారణంగా తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. కౌమార దశలోని బాల బాలికల్లో పోషకాహారలోపం వస్తే ఊబకాయం వస్తుందని వెల్లడించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కొటాల పీహెచ్‌సీకి కొత్త భవనం

చంద్రగిరి : మండలంలోని కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం నిర్మించారు. శుక్రవారం ఈ మేరకు ఎమ్మెల్యే పులివర్తి నాని చేతులమీదుగా భవనం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలోనే ఏజీపల్లె, బందార్లపల్లె, కొటాల దళితవాడలో పలు అభివృద్ధి పనులను సైతం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, ఎంపీడీఓ వెంకటరత్నం, తహసీల్దార్ శివరామ సుబ్బయ్య పాల్గొన్నారు.

14 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి నగరంలో వాహనాలు నడుపుతున్న 14 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో బెంగళూరుకు చెందిన శ్రీకృష్ణ షెల్టర్స్ ఎండీ కేపీ రాఘవేంద్రకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. నగరంలోని ఖాదీ కాలనీకి చెందిన వీవీ గ్రూప్ యజమాని వెంకి రెడ్డి వినోద్ చైతన్యకు వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.90లక్షలకు రాఘవేంద్ర చెక్ ఇచ్చాడు. అది బౌన్స్ కావడంతో చైతన్య కోర్టును ఆశ్రయించాడు. రాఘవేంద్రపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

రేపే మాలల ఆత్మగౌరవ సభ


మాట్లాడుతున్న అశోక్ రత్నం

తిరుపతి కల్చరల్ : స్థానిక మంగళం రోడ్డులోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మాలల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు రాయలసీమ మాలల జేఏసీ నేతలు వెల్లడించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ గౌరవాధ్యక్షుడు అశోక్‌రత్నం మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల, మాదిగల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. పాలకులు అవలంబిస్తున్న దళిత వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించే సభకు తెలంగాణ ఎమ్మెల్యే వివేక్‌తోపాటు జడ శ్రావణ్‌కుమార్, హర్షకుమార్ తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. అనంతరం సభ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో దళిత సంఘాల నేతలు మల్లారపు మధు, దుగ్గాని జయరాం, తాళ్లపాక దాము, రాజ్‌కుమార్, నాగేంద్ర, రాఘవులు పాల్గొన్నారు.

భక్తి తోటి మొక్కితిరి!

సారె సమర్పణకు వస్తున్న భూమన అభినయ్‌రెడ్డి



విశేషాలంకరణలో గంగమ్మతల్లి



తోటి వేషాలతో చిన్నారుల సందడి




పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమ్మా.. గంగమ్మతల్లీ.. చల్లగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని సేవించుకున్నారు. శుక్రవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా తోటి వేషాలు ధరించి గ్రామ దేవతను దర్శించుకున్నారు. శక్తిస్వరూపిణికి పొంగళ్లు పొంగించి..ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, తదితర ప్రముఖులు సంప్రదాయబద్ధంగా సారె సమర్పించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జయకుమార్, దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే శనివారం దొర వేషం ధరించి మొక్కులు చెల్లించుకోనున్నారు. – తిరుపతి కల్చరల్


వివిధ వేషాల్లో తరలివస్తున్న భక్తులు


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్


అమ్మవారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు


గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

అనధికార వసతి

ప్రతిష్టాత్మక ఎస్వీ విశ్వవిద్యాలయంలో బయటి వ్యక్తులు హల్ చల్ చేస్తున్నారు. ప్రధానంగా వసతిగృహాల్లో అనధికారికంగా బస చేస్తున్నారు. వర్సిటీకి సెలవులు ప్రకటించినప్పటికీ హాస్టళ్లలోనే తిష్ట వేసి పెత్తనం చెలాయిస్తున్నారు. పరిశోధక విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కోర్సులు పూర్తయినప్పటికీ గదులను ఖాళీ చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రీసెర్చ్ స్కాలర్లపై దౌర్జన్యానికి దిగుతూ నానా అవస్థలకు గురిచేస్తున్నారు.

- ఎస్వీయూ హాస్టళ్లలో బయటి వ్యక్తుల తిష్ట
- పరిశోధక విద్యార్థులకు తప్పని అవస్థ
- వర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాలని వినతి





ఎస్వీయూలోని ఐ బ్లాక్ హాస్టల్ భవనం

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీలో రీసెర్చ్ స్కాలర్లు బస చేసే ఐ బ్లాక్ మెస్ హాస్టల్ పూర్తిగా బయటి వారితో నిండిపోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనధికారికంగా కొందరు వ్యక్తులు గత కొంత కాలంగా వర్సిటీలోని వసతి గృహాలను తమ స్థావరాలుగా మార్చేసుకున్నారని ఆందోళన చెందుతున్నారు. హాస్టల్ గదుల్లోనే ఎలక్ట్రిక్ కుక్కర్లతో వంటలు చేసుకుంటూ అక్కడే కాలక్షేపం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవుల నేపథ్యంలో రోజూ కేవలం 500 లీటర్ల నీరు మాత్రమే పరిశోధక విద్యార్థులకు సరిపోతుందని, అనధికార వ్యక్తుల కారణంగా నిత్యం 1,500 లీటర్ల నీరు అవసరమవుతోందని వివరిస్తున్నారు.

60 గదుల ఆక్రమణ

ఎస్వీయూలోని ఐ బ్లాక్ మెస్ హాస్టల్‌లో మొత్తం 98 గదులు ఉన్నాయని, ఇద్దరు స్కాలర్లకు ఒకటి చొప్పున కేటాయిస్తే కేవలం 35 మాత్రమే సరిపోతాయని విద్యార్థులు వెల్లడిస్తున్నారు. అయితే వర్సిటీ అధికారులతో కుమ్మక్కై కోర్సులు పూర్తయినవారు, ఇతరులు దాదాపు 60 గదులను ఆక్రమించారని మండిపడుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే రీసెర్చ్ స్కాలర్లు, హాస్టల్ సిబ్బందిపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇదెక్కడి అన్యాయమని నిలదీస్తే యథేచ్ఛగా దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎమ్మెల్యేలు, మంత్రుల అనుచరులమని బెదిరిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. దీనిపై పరిశోధక విద్యార్థులు పలుమార్లు వీసీ, రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు స్పందించి వసతిగృహాల్లో తనిఖీలు చేపట్టాలని, అనధికారికంగా తిష్ట వేసిన వారిని బయటకు పంపించాలని కోరుతున్నారు. లేకుంటే హాస్టల్ నిర్వహణ బిల్లులను చెల్లించమని స్పష్టం చేస్తున్నారు.

రెండు రోజుల్లో ఖాళీ చేయిస్తాం



ఎస్వీయూ హాస్టళ్లలో అనధికార వ్యక్తులకు చోటు లేదు. ఐ బ్లాక్ బాయ్స్ హాస్టల్‌లో మాత్రం కోర్సు పూర్తైన విద్యార్థులు, బయట వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాం. రెండు రోజులలో హాస్టళ్లలో తనిఖీలు చేపడతాం. బయటి వారిని ఖాళీ చేయిస్తాం. వసతిగృహాలలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఉండాలి. లేకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

– సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

బుగ్గోత్సవం.. ప్రారంభం


దేవదేవేరులకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న బుగ్గోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి విశ్వరూప దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలోని బుగ్గ వద్దకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారిని వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారికి ఊంజల్ సేవ జరిపించారు. ఊరేగింపుగా బుగ్గ వద్దకు తీసుకువచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

పటిష్టంగా నిరంతర నిఘా


సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : గంగ జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా నిరంతరం సీసీ కెమెరాల నిఘాను పటిష్టంగా ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏర్పాట్లతోపాటు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. జాతర సందర్భంగా 12 సాయంత్రం నుంచి 14వ తేదీ ఉదయం వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. భక్తులు పొంగళ్లు పొంగించుకునేందుకు మార్కెట్‌లో వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణ ఆచారి, ఎంఈ తులసి కుమార్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఆలయ ఈవో జయకుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజీ పాల్గొన్నారు

త్వరితగతిన డ్రైనేజీల నిర్మాణం

నగరంలో చేపట్టిన డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ, కరకంబాడి మార్గంలోని సీపీఆర్ అపార్ట్‌మెంట్, రామానుజ కూడలి నుంచి శంకరంబాడి కూడలి వరకు పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గరుడ వారధి డివైడర్ల మధ్య నూతనంగా పూల మొక్కలు నాటాలని స్పష్టం చేశారు. ఎస్ఈ శ్యామ్ సుందర్, డీఈ రాజు, ఏసీపీలు బాలాజీ, మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు పాల్గొన్నారు.

దేశ రక్షణ దళాలకు రూ.5 లక్షల విరాళం


కమాండర్‌కు చెక్ అందిస్తున్న జ్యోతికృష్ణ, కుటుంబసభ్యులు

తిరుపతి సిటీ: దేశ రక్షణ కోసం రణరంగంలో ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాడుతున్న రక్షణ దళాలకు భారత పౌరుడిగా తనవంతు రూ.5 లక్షల విరాళాన్ని తన పుట్టిన రోజు సందర్భంగా అందజేసినట్టు తిరుపతి మంగళంకు చెందిన పీజీ హాస్టల్స్ యజమాని జ్యోతికృష్ణ తెలిపారు. ఈ మేరకు తిరుపతి పద్మావతి అతిథిగృహం సమీపంలోని ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఎన్‌సీసీ కమాండర్ సత్యేందర్ దయాకు రూ.5 లక్షల చెక్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తన వంతు బాధ్యతగా చిరు విరాళం తండ్రి శ్రీనివాసులునాయుడు చేతుల మీదుగా అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విరాళం అందించిన జ్యోతికృష్ణ కుటుంబ సభ్యులు, ఎన్‌సీసీ అధికారులు అనూప్ పాల్గొన్నారు.

ప్రేమావతి సేవలు మరువలేం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ : పద్మావతి జూనియర్, డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, ప్రిన్సిపల్‌గా డాక్టర్ డీఎం ప్రేమావతి అందించిన సేవలను మరువలేమని ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ కొనియాడారు. శుక్రవారం ఈ మేరకు కళాశాలలో సంతాప సభ నిర్వహించారు. ప్రేమావతి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రేమావతి వద్ద చదువుకున్న ఎందరో విద్యార్థులు దేశవిదేశాలలో ఉన్నతంగా రాణిస్తున్నారని చెప్పారు. నేను-నా కళాశాల పేరుతో ఆమె రచించిన పుస్తకం అందరికీ మార్గనిర్దేశం చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి, వార్డన్ హేమలత, డాక్టర్ ఉషారాణి, విశ్రాంత అధ్యాపకులు నిగర్ సుల్తానా, డాక్టర్ జ్యోతి, డాక్టర్ విద్యుల్లత, పద్మజ, వెంకటలక్ష్మి, నాగపద్మ పాల్గొన్నారు.


ప్రేమావతి (ఫైల్)

నోటీస్ బోర్డు

- తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా దొర వేషాలలో అమ్మవారిని దర్శించుకోనున్న భక్తులు.
- శ్రీగోవిందరాజస్వామివారి మాడ వీధుల్లో ఉదయం 4.45 గంటలకు నగర సంకీర్తన.
- ఎస్వీయూలో ఉదయం 9 గంటలకు 'మన పల్లె జానపద జాతర'
- పద్మావతిపురం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హోటల్ గ్రాండ్ రిడ్జ్, కొత్తపాళెం లే ఔట్, మార్కెట్ యార్డు, తిరుచానూరు, దామినేడు, కలెక్టరేట్, పద్మావతిపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం.
- వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మీడియా సమావేశం.
- తిరుచానూరులో పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలకు సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ.
- శ్రీగోవిందరాజస్వామి బుగ్గోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ, ఆస్థానం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి : తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఉంటుందని ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ల నిర్వహణ, లైన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం


ఊరేగుతున్న అమ్మవారు

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ ముఖ మండపం వద్ద స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. ఈ క్రమంలో సాయంత్రం కనులపండువగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం సిరులతల్లిని తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.

బాబు పాలన అధ్వాన్నం



నినాదాలు చేస్తున్న చింతా మోహన్ తదితరులు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలన అధ్వాన్నంగా ఉందని, ఆయన సొంత నియోజకవర్గం కుప్పంలోని ద్రవిడ యూనివర్సిటీలో ఏడాదిగా జీతాలు ఇవ్వలేదని కేంద్ర మాజీ మంత్రి, చింతామోహన్ విమర్శించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఆయన టీటీడీ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిగా టీటీడీ పరిపాలన భవనం వద్ద 30 పర్యాయాలకు పైగా ఆందోళనలు చేపట్టామన్నారు. టీటీడీలో పని చేసే అర్చకులు, శాశ్వత ఉద్యోగులు, వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. అలిపిరి నుంచి పేరూరు వరకు 400 ఎకరాలు టీటీడీ భూములున్నాయని, అందులో ఒక్కొక్కరికి ఐదు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు తిరుమలలో 500 దుకాణాలను కేటాయించాలని కోరారు. టీటీడీలో పనిచేసే ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్వీయూలో ప్రొఫెసర్లకు మూడు నెలలుగా జీతాలు అందలేదన్నారు. ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఆరోపించారు. శ్రీసిటీని కాంగ్రెస్ హయాంలో తెచ్చామని, 250 కంపెనీలు ఏర్పాటు చేశామని, వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. నిన్న ఒక మంత్రి శ్రీసిటీకి వచ్చి వెళ్లారని, ఆయన పర్యటన గురించి పేపర్లో గొప్పగా కథనాలు రాయించుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో కలెక్టరేట్ ఎదురుగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, వాటికి కూడా పసుపు రంగు వేయించడం దౌర్భాగ్యమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజారంజకంగా పాలించకుంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, వెంకటేష్, ముని శోభ, తేజోవతి, కుమార్, హేమంత్ పాల్గొన్నారు.

అధ్వాన్నం!



తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారి అధ్వాన్నంగా తయారైంది. చిన్నపాటి వర్షానికి సైతం నీరు నిల్వ చేరుతోంది. కాలు పెట్టాలంటే ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తుతోంది. అదమరిస్తే కింద పడాల్సి వస్తోంది. అనేక ప్రభుత్వ కార్యాలయాలకు సైతం ఈ మార్గంలోనే ప్రయాణించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకునేవారే లేని దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– తిరుపతి మంగళం